సాక్షి కర్నూలు

సోమవారం । 20 । ఫిబ్రవరి । 2023



శాస్త్రోక్తంగా పందిరి పూజ

ఆళ్లగడ్డ: అహోబిలంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా పందిరి పూజ ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. చలువ పందిళ్ల ఏర్పాటులో భాగంగా పూజలు చేసి పనులు ప్రారంభించారు.



అలరించిన నృత్యాలు

శ్రీశైలం టెంపుల్: శివదీక్షా శిబిరాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు భక్తులను అలరిస్తున్నాయి. భక్తి గీతాలకు కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



మానసిక అలజడి

మానసిక ఒత్తిడి ఇప్పుడు సాధారణమై పోయింది. జిల్లాలో వీరి సంఖ్య ఏటా పెరుగుతోంది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరిలో ఈ సమస్య కనిపిస్తోంది.

8లో▸

న్యూస్‌రీల్

ప్రశాంతంగా 'ఎస్‌ఐ' ప్రిలిమినరీ రాత పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కర్నూలు (టౌన్)/(అగ్రికల్చర్): పోలీస్ శాఖలో ఎస్‌ఐ ఉద్యోగాల భర్తీ కోసం ప్రిలిమినరీ రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 39 పరీక్ష కేంద్రాల్లో 19,800 మంది పరీక్ష రాయాల్సి ఉంది. అయితే ఉదయం పేపర్–1 పరీక్షకు 2,154 మంది మధ్యాహ్నం పేపర్–2 పరీక్షకు 2,218 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. కర్నూలు నగరంలోని పలు పరీక్ష కేంద్రాలను ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ తనిఖీ చేశారు. ఇదిలా ఉండగా ఆలూరుకు చెందిన రవికుమార్ అనే అభ్యర్థి పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష రాస్తూ అస్వస్థతకు గురయ్యాడు. ఇన్విజిలేటర్ వెంటనే స్పందించి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. దీంతో అతను పరీక్షను పూర్తిగా రాయలేకపోయారు.

కశ్మీర్ నుంచి కన్యాకుమారికి సైకిల్ యాత్ర



సైకిల్‌యాత్ర చేస్తున్న యువతి ముస్కాన్

వెల్దుర్తి: మధ్య ప్రదేశ్ రాష్ట్రం అశోక్‌నగర్ జిల్లాకు చెందిన 22 ఏళ్ల యువతి ముస్కాన్ రఘువంశి కశ్మీర్ నుంచి కన్యాకుమారికి సైకిల్ యాత్ర చేస్తున్నారు. ఈనెల 1న కశ్మీర్ నుంచి ప్రారంభించిన యాత్ర ఆదివారం ఉదయం వెల్దుర్తి చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అవకాశమిస్తే జీవితంలో ఏదైనా సాధించే ధైర్యం అమ్మాయిలకుందని అనే సందేశంతో (ఎ రైడ్ ఫర్ ఆల్‌ది గర్ల్స్ హు డేర్ టు డ్రీమ్ అన్న నినాదంతో) ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈనెల 25న కన్యాకుమారిలోని కోవిలపట్టిలో యాత్ర ముగుస్తుందన్నారు.

45 నిమిషాల్లోనే జీవాలకు చికిత్స



గొర్రెకు చికిత్స చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): పొరపాటున పురుగు మందు కలిసిన నీరు తాగి అస్వస్థతకు గురైన జీవాలను వైఎస్సార్ సంచార పశువైద్యశాల కాపాడింది. కోడుమూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన మస్తాన్ అనే రైతుకు 120కి పైగా జీవాలు ఉన్నాయి. ఉదయం జీవాలను నట్టల నివారణ మందులు తాపుతూ.. పొరపాటున పురుగుల మందును కూడా అందులో కలిపాడు. తాగిన కొద్ది నిముషాల్లోనే 20కిపైగా జీవాలు అస్వస్థతకు గురయ్యాయి. దీంతో ఉదయం 9.15 గంటల ప్రాంతంలో 1962 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా 10 గంటలకు అంబులేటరీ క్లినిక్ గ్రామానికి వచ్చింది. పురుగుల మందుకు సకాలంలో విరుగుడు ఇచ్చి 15 జీవాలను కాపాడారు.

లైసెన్స్ లేని డెంటల్ క్లినిక్‌లపై చర్యలు



డెంటల్ క్లినిక్‌ను పరిశీలించి బయటకు వస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

ఆదోనిటౌన్: ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న డెంటల్ క్లినిక్‌లపై చర్యలు తీసుకుంటామని ఏపీ స్టేట్ డెంటల్ కౌన్సిల్ ఎథికల్ కమిటీ సభ్యుడు డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆదోని పట్టణంలోని 14 డెంటల్ క్లినిక్‌లను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 11 క్లినిక్‌లకు లైసెన్సులు ఉన్నాయని, మిగిలిన మూడింటికి అనుమతులు లేకపోవడంతో చట్టరీత్యా చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నామన్నారు. అనుభవం లేని అసిస్టెంట్లతో వైద్యం చేయించుకోవద్దని, ప్రతి ఫీజుకు బిల్లు తప్పనిసరిగా పొందాలని ప్రజలకు ఆయన సూచించారు.

నయన మనోహరం

- వైభవంగా మల్లన్న రథోత్సవం
- భక్త కోటి నీరాజనం
- ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు
- స్వామిఅమ్మవార్లకు కనుల పండువగా తెప్పోత్సవం

ఈశ్వరా.. పరమేశ్వరా.. శంభో శంకరా.. అంటూ భక్తజనం ప్రణమిల్లుతుండగా.. శ్రీశైలేశుడి రథ చక్రాలు ముందుకు కదిలాయి. రథంపై భ్రామరీ సమేత మల్లన్న విహరిస్తుండగా లక్షలాది మంది భక్తులు తరించారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం సాయంత్రం శ్రీశైల పురవీధుల్లో మల్లికార్జునుడి రథోత్సవం నయన మనోహరంగా సాగింది. శంఖానాదాలు, డప్పుల శబ్దాలు హోరెత్తగా.. గొరవయ్యల నృత్యాలు, భక్తుల కోలాటాలు అలరించగా.. భక్తకోటి పులకించింది.



అశేష భక్తజనం నడుమ మల్లన్న రథోత్సవం కొనసాగుతున్న దృశ్యం (ఇన్‌సెట్లో) రథంపై కొలువైన భ్రామరీ సమేత మల్లికార్జునుడు

శ్రీశైలంటెంపుల్: శ్రీగిరి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఆదిదంపతుల రథోత్సవం కనుల పండువగా సాగింది. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గంగాధర మండపం వద్దకు మేళతాళాలతో ఊరేగింపుగా చేర్చారు. అనంతరం రథశాల వద్ద వేదపండితులు రథాంగపూజ, రథాంగహోమాది క్రతువులు శాస్త్రోక్తంగా నిర్వహించి ఉత్సవమూర్తులను రథంపైకి చేర్చారు. దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షుడు చక్రపాణిరెడ్డి, కార్యనిర్వాహణాధికారి లవన్న, శ్రీశైల జగద్గురు పీఠాధిపతి సిద్ధ పండితా రాధ్య శివాచార్య మహాస్వామి, ధర్మకర్తల మండలి సభ్యులు, ఇతర జిల్లా, పోలీస్, దేవస్థానం అధికారులు రథోత్సవ పూజలో పాల్గొన్నారు. అనంతరం సాత్వికబలిగా కొబ్బరికాయ, గుమ్మడికాయలను సమర్పించారు. గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు రథోత్సవం వైభవంగా సాగింది. రథంపై ఆశీనులైన స్వామిఅమ్మవార్లను భక్తులు కనులారా దర్శించి నీరాజనాలు సమర్పించారు. ఓం నమఃశివాయ, శంభోశంకరా అంటూ పరమేశ్వరుడిని కీర్తించారు. రథోత్సవం ముందు కళాకారుల నృత్యాలు, కోలాటాలు, డప్పు వాయిద్యాలు, కళారూపాలు, గొరవయ్యల నృత్యాలు ఆకట్టుకున్నాయి.





రథం ఎదుట సాత్విక బలి ఇస్తున్న ఈఓ, చైర్మన్ చక్రపాణిరెడ్డి, జగద్గురు పీఠాధిపతి తదితరులు, ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు

పుష్కరిణిలో స్వామిఅమ్మవార్ల విహారం..

ఉత్సవాల్లో భాగంగా స్వామిఅమ్మవార్లకు ఆదివారం రాత్రి ఆలయ పుష్కరిణి వద్ద తెప్పోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం నుంచి పుష్కరిణి వద్దకు చేర్చారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు తెప్పపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి తెప్పోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు.

నేడు పూర్ణాహుతి..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవ యాగాది క్రతువులకు సోమవారం ఉదయం పూర్ణాహుతి నిర్వహించనున్నారు. అనంతరం వసంతోత్సవం, కలశోత్సవం, త్రిశూలస్నానం నిర్వహిస్తారు. సాయంత్రం ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహిస్తారు.

ధాన్యం రైతు 'ధర'హాసం

- మార్కెట్‌లో వరికి గిట్టుబాటు ధరలు
- గతేడాది క్వింటా రూ.1,700.. ఈ ఏడాది రూ.2,900
- వేరుశనగ, మిరప పంటలకు దీటుగా ధాన్యం కొనుగోళ్లు
- అన్నదాతల్లో వెల్లివిరుస్తున్న ఆనందం



ఇంట్లోనే ధాన్యాన్ని నిల్వచేసుకున్న దృశ్యం

ఎమ్మిగనూరు: వరి సాగు ఈ ఏడాది రైతుకు కలిసొచ్చింది. దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. మార్కెట్‌లో మంచి ధర లభిస్తోంది. వేరుశనగ, మిరప పంటలకు దీటుగా ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌లలో వరి సాగు సాధారణ విస్తీర్ణం 31,402 హెక్టార్లు. అయితే ఈ ఏడాది వాతావరణం అనుకూలించటం, ప్రాజెక్టుల్లో విస్తారంగా సాగునీరు లభ్యంకావటంతో కేవలం ఖరీఫ్‌లోనే 28,651 హెక్టార్లలో వరి సాగైంది. రబీలో కూడా కాలువల కింద రైతులు ఈ పంటను సాగు చేసుకొన్నారు. ఒక్కో ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టగా.. 35 నుంచి 45 బస్తాల వరకు దిగుబడులొచ్చాయి. గతేడాది క్వింటా ధర రూ.1,700 పలికింది. ఈ ఏడాది ఆరంభం(జనవరి)లో కర్నూలు సోనా క్వింటా రూ.2,000, ఆరున్నర రకం(చిన్నసోనా), ఎన్‌డీఎల్(నంద్యాలసోనా) రకాలు క్వింటాల్ రూ.2,300 వరకు అమ్ముడుపోయాయి. ప్రస్తుతం క్వింటా రూ.2,900 ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. ఫిబ్రవరి నెలాఖరుకు రూ. 3,000 మార్కును అందుకోనుందని వ్యాపారులు చెబుతున్నారు.

ప్రభుత్వ తోడ్పాటు

ఖరీఫ్ పంట దిగుబడులను రైతులు వెంటనే అమ్ముకోకుండా అధిక ధరలు వచ్చే వరకూ వేర్‌హౌజ్‌ల్లో నిల్వచేస్తున్నారు .రైతుల అవసరాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 95 గోడౌన్ల నిర్మాణం చేపట్టింది. అంతేకాకుండా రైతులు నిల్వచేసుకొన్న పంటకు బ్యాంకులతో రుణాలు మంజూరు చేయిస్తోంది. కొంతమంది వేర్‌హౌజ్ యజమానులు కూడా వరి బస్తాకు రూ.1,000 చొప్పున రైతులకు రుణాలు ఇస్తున్నారు. దీంతో రైతులకు పెట్టుబడి ఇబ్బందులు తీరుతున్నాయి.

క్వింటా బియ్యం రూ.4500

మార్కెట్‌లో క్వింటా బియ్యం రూ.4500 పలుకుతోంది. ప్రభుత్వం రైతులకు ఇస్తున్న శిక్షణలతో రైతుల్లో చైతన్యం మొదలైంది. పంట అమ్మకాల్లో గత కొంతకాలంగా కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. తాము పండించిన పంట ధాన్యాన్ని మరపట్టించి బియ్యంగా మార్చుతున్నారు. ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలు ప్రాంతాల్లోని రైసు మిల్లులకు రైతులు వరిధాన్యాన్ని తరలిస్తున్నారు. ప్రస్తుతం కర్నూలుసోనా బియ్యం క్వింటా రూ.4300, నంద్యాల సోనా, సన్నబియ్యం రూ.4500 వరకు విక్రయిస్తున్నారు.

రైతుకు మంచికాలం



రైతులకు మంచి కాలం నడుస్తోంది. పంటలకు రేట్లు బాగున్నాయి. ఎప్పుడూ రూ1,800 దాటని వడ్లు ఈఏడు రూ.2,900 అమ్ముతున్నాయి. నేను పది ఎకరాల్లో నంద్యాల సోనా రకం సాగు చేశా. 400 బస్తాల దిగుబడి వచ్చింది. క్వింటా రూ.2900 చొప్పున విక్రయించా.

–ఎస్ పరమేష్, గురుజాల గ్రామం

గతంలో ఇంత రేటు లేదు



తుంగభద్ర నది పంపుసెట్ల కింద 2.5 ఎకరాల్లో కర్నూలు సోనా పండించా. 100 బస్తాల దిగుబడి వచ్చింది. క్వింటా రూ.2800 చొప్పున అమ్ముకొన్నా. గతంలో ఎప్పుడూ ఇంత రేటు లేదు. మంచి ధర వచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది.

– కురువ కిష్టప్ప,వరి రైతు

పూజ్యాయ.. రాఘవేంద్రాయ!

- 21 నుంచి శ్రీరాఘవేంద్రుల గురు వైభవోత్సవాలు
- ఆరు రోజుల పాటు వేడుకల నిర్వహణ



రాఘవేంద్రుల మూలబృందావనం

మంత్రాలయం: ప్రహ్లాదరాయల స్వరూపులు.. సశరీరంగా బృందావనస్థులైన భక్తుల కల్పతరువు.. శ్రీరాఘవేంద్రస్వామి. పవిత్ర తుంగభద్ర నదీతీరాన వెలసి ఖండాంతరాలకు ఖ్యాతిని గడించిన కామధేనువు. సద్గురు శ్రీరాఘవేంద్రులు జన్మదినం, పట్టాభిషేకం పురస్కరించుకుని గురువైభవోత్సవాలు ఈనెల 21 నుంచి కనుల పండువగా జరగనున్నాయి. పీఠాధిపతి శ్రీసుభుదేంద్రతీర్థులు ఆశీస్సులతో 21 నుంచి 26వ తేదీ వరకు ఆరు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తారు. 21వ తేదీన శ్రీగురుని 402వ పట్టాభిషేకం, 26న స్వామివారి జయంత్యుత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా రాఘవేంద్రుల స్వర్ణపాదుకలకు ముత్యాలు, రత్నాలు, పుష్పాలతో అభిషేకం చేయనున్నారు.

ఏర్పాట్లలో అధికారులు

శ్రీరాఘవేంద్రస్వామి గురువైభవోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మఠం ప్రాకారాలను పుష్పాలతో, విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. రోజూ సాయంత్రం భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రాఘవేంద్రుల ప్రశస్తి అవార్డులు

గురుభక్తి వైభోత్సవాల్లో భాగంగా సామాజిక సేవ, వైద్యం, వేదాంతం, సంగీతం, నాట్యం తదితర రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 48 మందికి అనుగ్రహ ప్రశస్తి అవార్డులు ప్రదానం చేయనున్నారు. అవార్డులు అందుకోనున్న వారిలో సుప్రీం కోర్టు జడ్జి రామసుబ్రమణియన్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు చీమల పాటి రవి, కృపాసాగర్, ఏపీ దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీ చరణ్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు ఉన్నారు.

రాఘవేంద్రుల చరిత్ర..

మూలరూపం: శంఖు కర్ణ **గోత్రం:** గౌతమి
తండ్రి: తిమ్మన భట్ **తల్లి:** గోపికాంబ
జననం: క్రీ.శ.1595 మన్మథనామ సంవత్సరం పాల్గుణ శుద్ధ సప్తమి, గురువారం
జన్మ నక్షత్రం: మృగశిర
జన్మభూమి: భువనగిరి, కర్ణాటక
పూర్వ నామం: వెంకటనాథుడు
వివాహం: క్రీ.శ.1614, ఆనందనామ సంవత్సరం, పాల్గుణ శుద్ధ
భార్య: సరస్వతీబాయి
ఆశ్రమంలో పేరు: శ్రీరాఘవేంద్ర తీర్థులు
రచన గ్రంథాలు: శ్రీమన్యాయసుధ పరిమళ, 48 గ్రంథాలు
బిరుదులు: వెంకటనాథాచార్య, పరిమళాచార్య, మహాభాష్య
బృందావన ప్రవేశం: క్రీ.శ. 1671 విరూధినామ సంవత్సరం, శ్రావణ బహుళ విదియ, శుక్రవారం.

కమనీయం.. మహానందీశుడి కల్యాణం

- మహానందికి పోటెత్తిన భక్తజనం



మహానందీశ్వరుడి దంపతులు

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానంది క్షేత్రంలో ఆదివారం తెల్లవారుజాముున మహానందీశ్వరుడి కల్యాణం కనులపండువగా సాగింది. లింగోద్భవ కాల రుద్రాభిషేకం అనంతరం కల్యాణాన్ని భక్తులు కనులారా వీక్షించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర రెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, డీసీ రాణాప్రతాప్, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకారపూజ, అక్షతల సమర్పణ, మాంగళ్య ధారణ పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం రాత్రి నుంచే మహానంది ఆలయం భక్తులతో కిక్కిరిసింది. వివిధ ఆర్జిత సేవా టికెట్ల ద్వారా శని, ఆదివారాల్లో రూ.25 లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. అయితే మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని భక్తులు విమర్శిస్తున్నారు.

ప్రాక్టికల్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి మార్చి7 వరకు నిర్వహణ
- ఉమ్మడి జిల్లాలో 49 కేంద్రాల ఏర్పాటు
- కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా
- పరీక్షలకు హాజరుకానున్న 5,969 మంది విద్యార్థులు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియట్ వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం నుంచి మార్చి 7వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరపనున్నారు. ఉమ్మడి జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన జూనియర్ కాలేజీలు 283 ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ జూనియర్ 15, కేజీబీవీ 06, ఎయిడెడ్ 02, ప్రైవేట్ 26, ట్రైబల్ వెల్ఫేర్ రెండు చొప్పున వొకేషనల్ కాలేజీలు ఉన్నాయి. ఈ కాలేజీల్లో చదువుతున్న 5,969 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకోసం 49 కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఈ నెల 24 వరకు మొదటి స్పెల్, 26 నుంచి మార్చి 2వ తేది వరకు రెండో స్పెల్, మార్చి 3 నుంచి 7వ తేది వరకు థర్డ్ స్పెల్‌లో పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష నిర్వహణ కోసం ఒక్కో విద్యార్థికి రూ.20 చొప్పున ఖర్చు చేసేలా నిధులు కేటాయించారు. ముందుగా కంటింజెంట్ నిధులు ప్రభుత్వ కాలేజీల్లోని కేంద్రాలకు అందజేసి ల్యాబ్‌ల్లో అవసరమైన వాటిని కొనుగోలుకు ఆదేశాలు ఇచ్చారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం

ఇంటర్ వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం నుంచి మొదలు కానున్నాయి. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. కాకపోతే లైవ్ స్ట్రీమ్ పనులు పూర్తి కాలేదు. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో ఆలస్యం అయ్యింది. – గురువయ్య శెట్టి, ఆర్ఐఓ

క్లుప్తంగా

రసవత్తరంగా పొట్టేళ్ల పోటీలు



పోటీలో తలపడుతున్న పొట్టేళ్లు

జూపాడుబంగ్లా: నందికొట్కూరు మండలం బిజినవేముల గ్రామంలో ఆదివారం పొట్టేళ్ల పోటీలు నిర్వహించారు. కాశీ చంద్రమౌళీశ్వరస్వామి తిరునాలను పురస్కరించుకుని నిర్వహించిన ఈ పోటీలకు 12 పొట్టేళ్లు వచ్చాయి. గెలుపొందిన పొట్టేళ్ల యజమానులకు వరుసగా రూ.10 వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేల నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రవికుమార్‌యాదవ్, దాతలు వెంకటరమణ, రబ్బాని, శ్రావణ్, తిరుమలేష్, గొల్లసవారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో స్తంభించిన ట్రాఫిక్



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో ఆదివారం ట్రాఫిక్ స్తంభించి పోయింది. టోల్‌గేట్ నుంచి సాక్షిగణపతి ఆలయం వరకు వాహనాలు బారులు తీరి నిల్చున్నాయి. సాక్షిగణపతి ఆలయం వద్ద ఆర్టీసీ బస్సు మరమ్మతులకు గురై నిలిచిపోవడంతో ఈ సమస్య తలెత్తింది. పోలీసులు సుమారు 3 గంటలపాటు శ్రమించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీంతో వాహనాలు సజావుగా సాగిపోయాయి.

బైక్ అదుపు తప్పి యువకుడు మృత్యువాత

వెలుగోడు: వెలుగోడు–బోయరేవుల రహదారిలోని పాత ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. వెలుగోడు పట్టణంలోని బాషానగర్‌కు చెందిన సురేష్(23) శివరాత్రిని పురస్కరించుకొని మహానందికి శనివారం ఉదయం బయల్దేరి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బైక్ అదుపు తప్పడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకొని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. తల్లిదండ్రులు నాగేంద్రుడు, లక్ష్మీదేవిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మాధవరావు తెలిపారు.

అప్పుల బాధతో బంగారుషాపు యజమాని ఆత్మహత్య

జూపాడుబంగ్లా: అప్పుల బాధతాళలేక నందికొట్కూరు పట్టణానికి చెందిన బంగారుషాపు యజమాని ఉస్మాన్‌బాషా(36) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఎన్వీ రమణ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని బైరెడ్డి కాంప్లెక్స్‌లో ఉస్మాన్ బాషా బంగారుషాపును నిర్వహిస్తున్నాడు. దుకాణం నిర్వహణ, కుటుంబ పోషణలో భాగంగా అప్పులు అధికం కావటం, రుణదాతలు ఒత్తిడి చేయటంతో మానసిక వేదనకులోనై శనివారం రాత్రి దుకాణంలో ఉన్న సైనెడ్ మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన దుకాణంలోని వర్కర్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు ముందుగా పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుని భార్య సమీన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

మానసిక అలజడి!

- పెద్దాసుపత్రిలో ప్రతి ఏటా 15 వేల మందికి చికిత్స
- ఉద్యోగం, వ్యాపారం, ఉన్నత చదువులలో ఒత్తిడే కారణం
- యోగా, ధ్యానం చేయాలంటున్న వైద్యులు
- సకాలంలో ఆహారం తీసుకోవడం ప్రధానం
- కంటి నిండా నిద్ర కూడా ముఖ్యమే



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక జబ్బుల విభాగం



కర్నూలు(హాస్పిటల్): మానసిక ఒత్తిడి ఇప్పుడు సాధారణమై పోయింది. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరిలో ఈ సమస్య కనిపిస్తోంది. ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడం, చిన్నకుటుంబాలు పెరిగిపోవడం, చిన్న తగాదాలు వచ్చినా సర్ది చెప్పేవారు లేకపోవడం, చాలా మంది ఏకాంతంగా గడపాల్సి రావడం..తదితర సమస్యలు పలు మానసిక జబ్బులకు కారణమవుతున్నాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక వ్యాధుల విభాగం ఓపీకి ప్రతిరోజూ 80 నుంచి 100 మంది రోగులు వస్తున్నారు. వీరిలో 40 శాతం మంది కొత్తవారు ఉండటం గమనార్హం. ఎక్కువ మంది ఆందోళన, కుంగుబాటు(డిప్రెషన్)కు గురై చికిత్స కోసం వచ్చిన వారే ఉంటున్నారు. వీరు గాక ప్రైవేటు వైద్యుల వద్దకు సైతం ప్రతిరోజూ 120 నుంచి 150 మంది దాకా రోగులు చికిత్స కోసం వస్తున్నారు. వీరితో పాటు 30 శాతం మద్యం, సిగరెట్ అలవాట్లు, 20 నుంచి 30 శాతం మంది తీవ్రమైన మానసిక సమస్యలు (స్కిజోఫ్రీనియా, మానియా, డిల్యూషన్ డిజార్డర్లు, బైపోలార్, సివియర్ డిప్రెషన్స్)తో వస్తున్నారు. వృద్ధుల్లో 5శాతం మంది నిద్రలేమి, మతిమరుపు సమస్యలతో బాధపడుతున్నారు. చిన్నపిల్లల్లోనూ 5శాతం మంది మానసిక సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. 2021లో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక జబ్బుల విభాగానికి ఓపీ 15,942, ఇన్‌పేషంట్లుగా 92 మంది చికిత్స పొందగా 2022లో ఈ సంఖ్య ఓపీ 19,475, ఇన్‌పేషంట్లు 175కు పెరిగింది.

నిద్రలేమితో అధిక సమస్యలు

కొంత మంది కొద్దిపాటి సమయం లభించినా కూర్చున్న చోటే ఒక కునుకు వేస్తారు. మరికొందరు అర్ధరాత్రి దాటినా గుడ్లగూబల్లాగా కళ్లు తెరుచుకుని అటూ ఇటూ చూస్తేనే ఉంటారు. ఇంకొందరు నిద్రపట్టక నిశాచర జీవుల్లా రాత్రిళ్లు ఊరంతా చుట్టేస్తుంటారు. పట్టణాల్లో అధికంగా రాత్రివేళ టీ హోటళ్ల వద్ద ఇలాంటి వారే మనకు కనిపిస్తుంటారు. ఎప్పుడో తెల్లవారుజామున వీరు ఇళ్లకు వెళ్లి నిద్రిస్తుంటారు. దీనికి మానసిక ఒత్తిళ్లు, డిప్రెషన్, ఆందోళనతో పాటు శారీరక వ్యాయామం లేకపోవడం, అధికంగా ఆహారం తీసుకోవడం, ఎక్కువగా మొబైల్ ఫోన్, టీవీ, కంప్యూటర్ స్క్రీన్‌లకు అతుక్కుపోవడమేనని వైద్యులు చెబుతున్నారు. నిద్రలేమి కారణంగా మరుసటి రోజు శారీరకంగా ఉత్సాహంగా ఉండలేరు. ఇది ఆ రోజు పనిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. గ్యాస్ట్రబుల్, గుండెదడ, ఊబకాయం, మలబద్ధకం, బీపీ, షుగర్ వంటి ఆరోగ్యసమస్యలు కొత్తగా తలెత్తుతాయి.

ప్రతి ఒక్కరిలోనూ ఒత్తిడి

ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక టెన్షన్ ఉంటుంది. ఒకస్థాయిలో టెన్షన్ ఉంటేనే జరగాల్సిన కూడా సవ్యంగా, శీఘ్రంగా జరుగుతుంది. కానీ ఆ టెన్షన్ పరిమితి దాటితేనే అసలు సమస్య. దురదృష్టవశాత్తూ సమాజంలో అధిక టెన్షన్‌కు గురయ్యే వారి సంఖ్య ఎక్కువైంది.

దీనికితోడు యువకులు, మధ్యవయస్సుల్లోని వారికైతే సాధించాల్సిన లక్ష్యాలు ఎక్కువ కావడం, తక్కువ సమయంలో ఎక్కువ లక్ష్యాన్ని సాధించాల్సి రావడం, స్థాయికి మించిన పని ఒప్పుకోవడం, పిల్లలకైతే ఏ రోజు సిలబస్ ఆ రోజే పూర్తి చేయకుండా పరీక్షల సమయంలో చదువుకోవడం వల్ల ఒత్తిడి పెరగడం జరుగుతోంది.

ఇలా చేస్తే మంచి ఫలితం

- ఇష్టమైన పనులు చేయాలి,
- బాధలు, కష్టాలను కుటుంబసభ్యులు, సన్నిహితులతో పంచుకోవాలి.
- భావోద్వేగాలను అదుపులో ఉంచుకోకూడదు.
- ఉదయాన్ని వాకింగ్ చేయడం, ధ్యానం, యోగా చేయాలి. దీనివల్ల డిప్రెషన్, మానసిక ఒత్తిడి అదుపులోకి వస్తాయి.
- వారాంతంలో కుటుంబసభ్యులతో కలిసి విహార యాత్రకు, సినిమాలకు, షాపింగ్‌కు వెళ్లాలి.
- అందుబాటులో ఉంటే రోజులో ఒక్కసారైనా కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేయాలి.

మానసిక రోగుల సంఖ్య పెరుగుతోంది



మానసిక రోగుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం అన్ని రకాల మానసిక సమస్యలకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స అందిస్తున్నాం. గతంలో కేవలం పిచ్చి లక్షణాలున్న వారు మా వద్దకు వచ్చేవారు. ఇప్పుడు అన్ని రకాల సమస్యలున్న వారు చికిత్స కోసం వస్తున్నారు. ఒక విధంగా మానసిక ఆరోగ్య సమస్యల వల్ల అవగాహన పెరగడం వల్లే కేసులు పెరిగాయి.

–డాక్టర్ ఇక్రముల్లా, సైకి యాట్రిస్ట్, జీజీహెచ్, కర్నూలు

కౌన్సెలింగ్ ద్వారా సమస్యల పరిష్కారం



ఆర్థిక సమస్యలు, చదువు, ఉద్యోగం ఒత్తిళ్ల కారణంగా ఆందోళన, డిప్రెషన్ పెరిగిపోతోంది. గతంతో పోలిస్తే మానసిక సమస్యలతో బాధపడే వారి సంఖ్య ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగిపోయింది. దీనిని కౌన్సెలింగ్, హిప్నోథెరపీ ద్వారా తగ్గించవచ్చు.

–సిరిగిరెడ్డి జయరెడ్డి, హిప్నోథెరపిస్ట్, సైకాలజిస్టు, కర్నూలు

వైద్యుల సలహా తీసుకోవడం ఉత్తమం



చాలా మంది మానసిక వైద్యుల వద్దకు వెళ్లాలంటే జంకుతుంటారు. కానీ ప్రస్తుత కాలంలో వచ్చే అనేక ఆరోగ్య సమస్యలకు మూలం మానసిక ఆరోగ్యసమస్యలే. దీనిని సవరించుకుంటే ఆరోగ్య సమస్యలు వాటంతట అవే సద్దుమణుగుతాయి. మీలో ఉండే లక్షణాలను బట్టి వైద్యుని వద్ద ప్రస్తావిస్తే మీ ఆరోగ్య సమస్యకు మూలం గుర్తించి చికిత్స చేస్తారు.

–సాయిరామ్, ఉద్యోగి, జీజీహెచ్, కర్నూలు

శివరాత్రి వేడుకల్లో అపశ్రుతి

- తలపై బండరాయి పడి బాలుడి మృతి
- నిలిచిన స్వాముల వారి కల్యాణం



మృతి చెందిన మౌలాలి (ఫైల్)

ఓర్వకల్లు: మండలంలోని కన్నమడకల గ్రామంలో శనివారం నిర్వహించిన మహాశివరాత్రి వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకొంది. తలపై బండ రాయి పడడంతో బాలుడు మృతి చెందాడు. దీంతో స్వాముల వారి కల్యాణోత్సవాన్ని నిర్వాహకులు నిలిపివేశారు. కన్నమడకల గ్రామానికి చెందిన చాకలి వెంకటేశ్వర్లు, అతని పెద్ద కుమారుడు చాకలి మౌలాలి(14) గ్రామ శివారులో వెలసిన బుగ్గరామేశ్వరస్వామి దేవస్థానం వద్ద శివరాత్రి జాగరణ నిమిత్తం వెళ్లారు. బ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటకాన్ని తిలకిస్తూ నిద్ర మత్తురావడంతో వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లాడు. అయితే తన స్నేహితులతో కలసి పక్కనే ఉన్న సత్రంపైకి ఎక్కి నాటకం చూస్తున్న మౌలాలి టీ తాగేందుకని కిందకు దిగే క్రమంలో పైన ఉన్న బండరాయి విరిగి తలపై బలంగా పడింది. దీంతో మౌలాలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతిపై ఆరాతీశారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. బాలుడి మృతితో స్వాముల వారి కల్యాణాన్ని అర్ధంతరంగా నిలిపివేసినట్లు ఆలయ ఈఓ మద్దిలేటి తెలిపారు.

తల్లీబిడ్డ దుర్మరణం

- నల్లమలలో రోడ్డు ప్రమాదం
- బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ
- క్షతగాత్రులను కాపాడటంలో చొరవ చూపని వాహనదారులు
- మానవత్వంతో స్పందించిన పత్రికా విలేకరి



గాయపడిన మహిమను కారులో తరలిస్తున్న జంబులయ్య



ప్రాణాలతో బయట పడిన పెద్ద కుమార్తె



మృతి చెందిన సాత్విక

ఆత్మకూరురూరల్: నల్లమలలో ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని బైర్లూటీ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీబిడ్డ దుర్మరణం చెందారు. పాములపాడు మండలం ఇస్కాల గ్రామానికి చెందిన పెద్ద జంబులయ్య సొంత పనుల నిమిత్తం భార్య మహిమ(30), ఇద్దరు కుమార్తెలతో కలసి బైక్‌పై ప్రకాశం జిల్లా మార్కాపురానికి బయలుదేరాడు. కర్నూలు – గుంటూరు రహదారిలో బైర్లూటీ దాటిన తర్వాత గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో జంబులయ్య భార్య మహిమ, చిన్న కుమార్తె సాత్విక (2) తీవ్రంగా గాయపడ్డారు. ఆ రహదారి వెంబడి వెళ్తున్న వాహనదారులు దాదాపు అర గంట పాటు ఎవరూ స్పందించ లేదు. కళ్లెదుటే భార్య, బిడ్డ తీవ్ర గాయాలతో ఆర్తనాదాలు చేస్తుంటే జంబులయ్య వారిని కాపాడేందుకు ప్రతి వాహనాన్ని చేతులెత్తి మొక్కుతూ వేడుకున్నా ఎవరూ ఆపలేదు. కనీసం ఏం జరిగిందో కూడా ఆరా తీయలేదు. కొద్ది సేపటి తర్వాత అటుగా వెళ్తున్న ఎమ్మిగనూరుకు చెందిన ఓ పత్రికా విలేకరి శ్రీనివాసనాయుడు తన వాహనాన్ని నిలిపి గాయపడిన వారిని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే తీవ్రంగా గాయపడిన మహిమ, సాత్విక మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. జంబులయ్య, పెద్ద కుమార్తె స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఆత్మకూరు ఎస్ఐ కృష్ణమూర్తి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కుమారుడి మరణం తట్టుకోలేక .. తండ్రి హఠాన్మరణం





మృతిచెందిన వేల్పుల సూరి (ఫైల్), వెంకటేశ్వర్లు (ఫైల్)

మిడుతూరు: కుమారుని మృతుని జీర్ణించుకోలేక ఓ తండ్రి ఆదివారం తెల్లవారుజామున హఠాన్మరణం చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని నాగలూటి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వేల్పుల సూరి (23) డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఒక సంవత్సరం బాలుడు, భార్య ఉన్నారు. మద్యానికి బానిసై శనివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం తెలిసి తండ్రి వేల్పుల వెంకటేశ్వర్లు (58) తల్లడిల్లిపోయాడు. ఆదివారం గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గంటల వ్యవధిలోనే కుమారుడు, తండ్రి మృతిచెందడంతో గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

దూసుకొచ్చిన టిప్పర్.. ఒకరు మృతి



ప్రమాదానికి కారణమైన టిప్పర్,(ఇన్‌సెట్) మృతి చెందిన కాశీవిశ్వనాథ్

పాణ్యం: టిప్పర్ వేగంగా దూసుకు రావడంతో గొర్రెల కాపరితోపాటు ఆరు గొర్రెలు మృతి చెందాయి. ఈ దుర్ఘటన పాణ్యం సమీపంలోని సాయిబాబా గుడి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన కురువ కాశీ విశ్వనాథ్(36)తో పాటు మరో ఇద్దరు గొర్రెలను మేపుకునేందుకు నంద్యాల మండలం భీమవరం గ్రామానికి వెళ్తున్నారు. పాణ్యం సమీపంలోని సాయిబాబా గుడి వద్ద జాతీయ రహదారిపై వెళ్తున్న టిప్పర్ గొర్రెల మందపైకి దూసుకొచ్చింది. ఈ ఘటనలో ఆరు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. కురువ కాశీ విశ్వనాథ్ తలకు, కాళ్లకు తీవ్ర గాయాలవడంతో హైవే అంబులెన్స్‌లో శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య కురువ ఆదిలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యాన పంటల్లో యాజమాన్య పద్ధతులు

- మామిడిలో పండు ఈగను తరిమేద్దాం
- అరటి గెలలను కాపాడుకుందాం
- ఉద్యానశాఖ సహాయ సంచాలకులు పి.రామాంజనేయులు సూచనలు



కర్నూలు అగ్రికల్చర్: జిల్లాలో ఉద్యాన పంటలు ఎక్కువగానే సాగులో ఉన్నాయి. ముఖ్యంగా మామిడి, అరటి, చీని, నిమ్మ, జామ వంటి తోటల్లో కొన్ని యాజమాన్య పద్ధతులు చేపట్టాల్సి ఉందని ఉద్యానశాఖ సహాయ సంచాలకులు పి.రామాంజనేయులు తెలిపారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే వేసవిలో పండ్లతోటలకు నష్టం జరుగకుండా చూసుకోవచ్చన్నారు. ఆయన తెలిపిన వివరాలు..

- మామిడి ప్రస్తుతం పిందె దశలో ఉంది. పిందె రాలకుండా లీటరు నీటికి పొటాషియం నైట్రేటు 10 గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలి. ప్లానోఫిక్స్ 1 ఎంఎల్ నాలుగు లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. దోమ నివారణకు కాన్ఫిడార్ లీటరు నీటికి 0.5 ఎంఎల్ కలిపి పిచికారీ చేసుకోవాలి. పండు ఈగ నివారణకు తోటల్లో 2 ఎంఎల్ మలథీయాన్, 2 ఎంఎల్ మిథైల్ యుజీనాల్ లీటరు నీటికి కలిపి ఎర ద్రావణం తయారు చేసి ఒక్కొక్క ప్లాస్టిక్ పళ్లెంలో పోసి ఎకరాకు నాలుగు చోట్ల ఉంచాలి. ప్యాకింగ్ చేసిన మామిడి కాయలను దూర ప్రాంత రవాణాకు కోసిన 6–8 గంటల లోపు శీతల గిడ్డంగులలో 12.5 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత 80–90 శాతం తేమ వద్ద నిల్వ ఉంచాలి. లేత తోటలలో మొక్కలకు నీరు పెట్టడం ద్వారా ఎండ వేడిమి నుండి కాపాడుకోవచ్చును.
- అరటిలో వైరస్ తెగుళ్ల వ్యాప్తి చేసే రసం పీల్చే పురుగుల నివారణకు ఎసిపేట్ 1.5 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. అవిశ లాంటి త్వరగా పెరిగే మొక్కలను తోట చుట్టూ 3–4 వరుసలు నాటుకుంటే వేడి గాలులను అడ్డుకుంటాయి. గెలలు సగం పూర్తి అయ్యాక కార్శి పంట కోసం ఒక సూది పిలకను వదిలి మిగిలిన పిలకలను కోసి వెయ్యాలి. వేసవిలో గెలల రక్షణకు ఎండు ఆకు చుట్టాలి. లేత గెలల తోటలో వడ గాలులకు ఆకులు పూర్తిగా మాడిపోయి ఎండిపోతాయి. ఇటువంటి తోటలకు నీటి తడులు దగ్గర దగ్గరగా ఇవ్వాలి. లీటరు నీటికి 5 గ్రాములు పోటాషియం నైట్రేట్ లేదా సల్ఫేట్ ఆఫ్ పొటాష్‌లను మార్చి, మార్చి జిగురుతో కలిపి వారం రోజుల వ్యవధిలో నాలుగుసార్లు ఆకులు, గెలలు పూర్తిగా తడిచేలా పిచికారీ చేసి నష్టాన్ని కొంతవరకు నివారించవచ్చును.
- చీనీ, నిమ్మ తోటల్లో చెట్లపై మంగు నివారణకు డైకోపాల్ 3 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అధిక వేడి నుంచి చెట్లను కాపాడుకోవటానికి పాదల్లో ఎండు ఆకులు, వరి పొట్టు పోసుకోవాలి. లీటరు నీటికి 20 గ్రాముల సున్నం కలిపిన ద్రావణాన్ని పల్చటి తెల్లటి పొర ఏర్పడే విధంగా చెట్లపైన, కాయలపైన పిచికారీ చేయాలి. ఈ ద్రావణంతో పాటు జిగురు కొద్దిగా కలుపుకుంటే సున్నం ఆకులను, కాయలకు బాగా అతుక్కొని ఎక్కువ కాలం ఉంటుంది.
- జామలో బెరడు తొలిచే పురుగు నివారణకు కాండం రంధ్రాలలో 5మిల్లీ లీటరు డైక్లోరోవాస్ లేదా కిరోసిన్ పోసి బంక మట్టితో పూడ్చాలి.
- సపోటా లేత తోటలకు తప్పనిసరిగా నీరు పెట్టాలి. ముదురు తోటలకు అవసరాన్ని బట్టి నీటి తడులు ఇవ్వాలి.

క్రైం కార్నర్

రేషన్ బియ్యం పట్టివేత

కర్నూలు (టౌన్)/ హొళగుంద: అక్రమంగా నిల్వ ఉంచి, తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం వేర్వేరు చోట్ల అధికారులు పట్టుకున్నారు. హొళగుంద గ్రామంలో 250 బస్తాల పీడీఎస్ బియ్యం, 116 బస్తాల నూకలు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అలాగే కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో 125.40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీం చేసుకున్నారు. లారీతోపాటు ఒక కారును రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. ఆత్మకూరు మండలానికి చెందిన వెంపల్లి వంశీ, అదే మండలం గరీబ్ నగర్‌కు చెందిన పీర్ల ఇబ్రహీమ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు విజిలెన్స్ సీఐ నాగరాజ యాదవ్ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని మాధవరం గ్రామంలో తుంగభద్ర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు మాధవరం పోలీసులు తెలిపారు. సూగూరు గ్రామానికి చెందిన శేఖర్ స్వామి, మాధవరం గ్రామానికి చెందిన నరసింహులుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మహిళ, ఇద్దరు పిల్లలు అదృశ్యం



అదృశ్యమైన మమత

బనగానపల్లెరూరల్: మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన వడ్డె మమత అనే మహిళ తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామిరెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. భానుముక్కలలో జరిగే దేవర నిమిత్తం తన మేనమామ అశోక్ ఇంటికి ఈ నెల 16వ తేదీన కూతురు అమూల్య(3), కుమారుడు అదిత్య వర్మ(2)లతో కలిసి మమత వెళ్లారు. ఈ నెల 17న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమయ్యారు. భర్త వడ్డె రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహం కాలేదని బలవన్మరణం

మిడుతూరు: వివాహం కాలేదని జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలపరిధిలోని చౌట్కూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. చౌట్కూరు గ్రామానికి చెందిన బోయ ఎల్లప్ప కుమారుడు వేణుగోపాల్ (30) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తల్లి మూడేళ్ల క్రితం కోవిడ్‌తో మరణించడంతో తండ్రి ఎల్లప్ప తన కూతురు వద్ద ఉంటున్నాడు. వివాహం కాలేదని జీవితంపై విరక్తి చెంది వేణుగోపాల్ ఇంటిలోనే దెంతెలకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఎల్లప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్య



బోయ శ్రీను (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సోగనూరు గ్రామానికి చెందిన బోయ శ్రీను(32) అప్పుల బాధతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు ఎనిమిది ఎకరాల పొలం ఉంది. మరో 9 ఎకరాలు కౌలు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. పంటల సాగుకోసం బ్యాంకు, బయట వ్యక్తుల దగ్గర రూ.3 లక్షలకు పైగా అప్పు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలని మనోవేదనకు గురై శనివారం అర్ధరాత్రి కూల్ డ్రింక్‌లో పురుగు మందు కలుపుకొని తాగాడు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ హెడ్‌కానిస్టేబుల్ చంద్ర తెలిపారు.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం

ప్యాపిలి: మండల పరిధిలోని బోంచెర్వుపల్లి గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతానికి గురై బాలకృష్ణ (19) అనే యువకుడు మృతి చెందాడు. రాచర్ల ఏఎస్సై జగన్ నాయక్ తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన వడ్డే శివయ్య, సుబ్బలక్ష్మిల కుమారుడు వడ్డే బాలకృష్ణ అనంతపురం వద్ద కియా మోటర్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. శివరాత్రి సందర్భంగా సెలవు రోజు కావడంతో స్వగ్రామానికి వచ్చాడు. స్వగ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న తమ ఇంటికి క్యూరింగ్ నిమిత్తం నీళ్లు పట్టేందుకు బోర్ ఆన్ చేసేందుకు వెళ్లాడు. అక్కడ ఇనుప కడ్డీని తాకడంతో విద్యుత్ ప్రసరించి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఎస్ఐ పరీక్ష రాయడానికి వచ్చి

- ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్

కర్నూలు అగ్రికల్చర్: శ్రీకాకుళం జిల్లా జులుమూరు మండలం దోమనాపల్లికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ఎం.మోహన్‌రావు(26) కర్నూలులో ఎస్ఐ పరీక్ష రాయడానికి వస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కర్నూలు రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతూ కాలు జారి రైలు కిందపడి మృతి చెందాడు. మృతుడు హైదరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

చిరుత దాడిలో గొర్రె మృతి

కోసిగి: మండల పరిధిలోని గౌడుగల్లు గ్రామానికి చెందిన కిందింటి రామాంజినేయులు, చిన్న మారెన్నలకు చెందిన గొర్రెల మందపై శనివారం అర్ధరాత్రి చిరుత దాడి చేసింది. దీంతో ఒక గొర్రె మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ ఆదోని రేంజ్ ఆఫీసర్ రామచంద్రుడు, బీట్ ఆఫీసర్ షమిఉల్లా గ్రామానికి చేరుకుని స్థానిక పశువైద్యాధికారితో మృతి చెందిన గొర్రెకు పోస్టు మార్టం చేశారు.